# నీడ



## మధురాంతకం నరేంద్ర

రంగనాయకుల్ని ఎలాగైనా ఏడిపించాలనిపించింది నిత్యానందానికి.

అందుకు కారణం లేకపోలేదు.

'త్యాగరాజ మండపంలో వేదాంత ఉపన్యాసాలు జరుగుతున్నాయి, రమ్మంటే నాకు ఇంట్లోనే ప్రశాంతత దొరుకుతుంది నువ్వెళ్ళి రమ్మంటాడు రంగనాయకులు.

'గుడిలో దేవుడి ఉత్సవాలు జరుగుతున్నాయి, రమ్మంటే 'నాకు ఇంట్లోనే అన్నివుత్సవాలకూ తావుందిలె' మ్మంటాడు రంగనాయకులు.

ఎప్పుడయినా దైవదర్శనానికి వెళ్ళివద్దాం రమ్మంటే దేవుడిపైన నాకు నమ్మకంలేదని చెబుతాడు.

చెప్పేసి మౌనంగా వుండిపోతే నిత్యానందానికేం బాధలేదు. చెబుతూ అతనో నవ్వు నవ్వుతాడు. ఆనవ్వులో 'ఎంత తెలివితక్కువ వాడివిరా పిచ్చిసన్యాసీ!' అనేహేళనదాగి వుంటుంది. నవ్వును చూస్తే ఒళ్ళుమండిపోతుంది నిత్యానందానికి. ఆనవ్వునెలాగైనా ఏడుపుగా మార్చాలని అనిపిస్తుంది.

రంగనాయకులు, నిత్యానందం- ఇద్దరూ ఒకే ఆఫీసులో టైపిస్టులుగా పనిచేస్తున్నారు. ఇద్దరూ సాయంకాలం ఒకే టైప్ఇన్‌స్టిట్యూట్‌లో తెలుగు టైపింగ్ నేర్చుకుంటున్నారు.

నిజానికి రంగనాయకులు బొలోమని ఏడిస్తే చూడాలని లేదు నిత్యానందానికి అతడు మానసికంగా రవంత బాధపడినా నిత్యానందానికదే పదివేలు!

ముందుగానే వ్రాసిపెట్టబడిన మేటరును చూచి యధాతధంగా టైపు చెయ్యడం మాత్రమే చెయ్యగలిగినంత చిన్నబుర్రగలిగిన వాడుకాడు నిత్యానందం. చిన్నదనంలో

అతడూ కథలూ, నవలలూ రాయాలనుకొని చేతికి ఇంక్ రాసుకొని కాగితాలు కరాబు చేసినవాడే!

అందుకే అతడు తన బుద్ధికుశలతనంతా చేర్చి ఒక పాంప్లెట్ లాంటి నోటీసును తయారుచేశాడు—

'దేవుడు దయార్ద్రహృదయుడు. అతడు పాపము చేసిన వారిని కూడా ప్రార్థించినచో మన్నించికాపాడగలడు. ఆయన దృష్టిలో అందరూ ఒక్కటే! ఆయనకు తన పర భేదములేదు. ఈ విషయంపైన నమ్మకము లేనిచో మీరొకసారి మన పురాణములను పరిశీలించుడు'- అంటూ పురాణములలోని దేవుని మహాత్యాన్ని గురించి అరపేజీ వ్రాసాడు.

తరువాత— 'నేడుసైతం అనేక మహాత్మ్యములు చూపించుచునే యున్నాడు. దేవుని నమ్మినవాడు చెడిపోడు. వారము రోజుల లోగా మొత్తము యాభై కాపీలు తీసి మీకు తెలిసిన వారికందరికీ పంపవలయును. అట్లుపంపినవారికి వారము రోజులులోగావారి యిష్టకామ్యార్థములు అన్నియూసిద్ధించును. పంపనివారు తమ సర్వసమునూ కోల్పోయి దరిద్రులగుదురు. ఉదాహరణకు'- అంటూ ఎవరెవరో కోటీశ్వరులైనట్లు, మరికొందరు బిక్షాధికారులైనట్లు, కల్పించి మొత్తానికి ఒక అరతావుకాగితానికి రెండువైపులా పూర్తిగా నింపేశాడు నిత్యానందం.

మరునాడు తెలుగు టైపురైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో దాన్ని ఓపిగా టైపు చేసి, కవర్లో జాగ్రత్తగావుంచి రంగనాయకులకు పోస్టు చేసేశాడు.

అయిదు రోజులు తరువాత చేతిలో ఒకే రకమయిన కవర్లకట్టచేతబట్టుకొని ఎదురైన రంగనాయకుల్ని చూసి మనసులో తృప్తిగా నవ్వుకుంటూ "ఎందుకోయ్‌అన్నికవర్లు పట్టుకెడుతున్నావ్?" అనిఅడిగాడునిత్యానందం.

"అబ్బే! ఏంలేదు... ఏంలేదు..." అంటూ అతను ఐకటిరెండు మాటలు మాట్లాడి, ఎవరో తరుముకొస్తున్నట్టుగా అక్కడినుంచి ఉడాయించేశాడు.

నిత్యానందం హాయిగా నవ్వుకున్నాడు.

* * *

రెండు మూడురోజులతరువాత- ఒకనాడు పోస్ట్‌మాన్ యిచ్చివెళ్ళిన కవర్ను తీసుకొని చించిచూశాడు నిత్యానందం. అందులోని కరపత్రాన్ని పూర్తిగా చదవకముందే అదేమిటో అర్థమైపోయింది అతడికి.

—అది తాను తయారుచేసిన కాగితమే!

—అంటే రంగనాయకులు తనకూ ఒక కాపీ పంపాడన్న మాట!

అతడెన్నుకున్న యాభైమందిలో తనూ ఒక్కడు!

నిత్యానందానికి నవ్వొచ్చేసింది.

వారం రోజులు గడిచిపోయాయి.

ఉన్నట్లుండి అతడికి వాళ్ళ నాన్నగారు పోయినట్లు టెలిగ్రాము వచ్చింది.

తరువాత నెలరోజులకే వాళ్ళ మామగారు పోయారు.

ఆఫీసులో అతడికి రావలసిన ప్రమోషన్ మరొకడికి వెళ్ళింది.

వాళ్ళ ఆవిడ ఆరోగ్యం పాడయ్యింది.

తనకిలా ఒకదానివెంట మరో కష్టం రావడానికేదో కారణమున్నట్టే తోచింది నిత్యానందానికి.

ఆ కారణ మేమిటి?

తానేం తప్పుచేశాడు?

చాలాసేపు ఆలోచించిన తరువాత అతడికా విషయం గుర్తుకొచ్చేసింది.

నాలుగైదు రోజుల తరువాత ఒకినాటి సాయంకాలం మార్కెట్టు నుంచి ఇంటికి వెడుతున్న రంగనాయకులకు ఎదురొచ్చాడు నిత్యానందం.

అతనిచేతిలో ఒకటే రకం కవర్లు ఒకకట్ట వాటితో బాటే తెల్లకాగితాలు ఒకచుట్ట-

"ఏమిటోయ్ నిత్యానందం! ఏమిటన్ని కాగితాలూ, కవర్లూ తీసుకెడుతున్నావ్? ఏమిటీ కధ?" అని అడిగాడు రంగనాయకులు నవ్వుతూ.

"అబ్బబ్బే... మరేంలేదు... ఊరకనే... ఏంలేదు... పనుంది ... ఇంటికెడతాను ..." తడబడుతూ అతడు ముందుకు సాగిపోయాడు.

ఆ రోజు రాత్రి నిత్యానందం కొడుకు పిల్లల పత్రికలో నుంచి ఏదో కథ చదువుకుంటున్నాడు-అందులో ఒక మాంత్రికుడు ఒక బ్రహ్మరాక్షసిని సృష్టిస్తాడు. చివరకు ఆ బ్రహ్మరాక్షసి అతడినే మింగేసెయ్యడం కోసం అతడి వెంటపడి తరుముతుంది. అతడు అందకుండా పరుగెడుతుంటాడు. చివరకు బ్రహ్మరాక్షసి అతడిని పట్టుకొని మింగేసి తన ఆకలి తీర్చుకొంటుంది.

భోజనానంతరం వాలు కుర్చీలో పడుకున్న నిత్యానందం కథ చివరికొచ్చేసరికి ఉలిక్కిపడ్డాడు.

కానీ అతడికా క్షణంలో తనను తరుముకొస్తున్న దెయ్యమేమిటో అర్థంగాలేదు! ●


## వచ్చేవారం

- ఇచ్చట దొంగ వస్తువులు అమ్మబడును! (హైద్‌రాబాద్‌లోని "జుమేరాత్ బజార్" వాస్తగాధ) (ఈవారం విశేష రచన) — బాల మురళీకృష్ణ — తులసి
- గరళం (కథ) — వమ్మి వీరభద్ర రావు
- ఆర్తి (కథ) — వి. పూర్ణచంద్రరావు
- మన(స్)తత్వం (కథ) — ఇచ్ఛాపురపు రామచంద్రం
- శ్రీ శ్రీ చైనా పర్యటన అనంతం లో
- సావేరి
- రాజు—పేద
- బాలతంత్ర • సినీతంత్ర • ఇతర ఆకర్షణలు